
# మాఇంటికి రండి

అలపర్తి రామకృష్ణ




డాబాపైన యాంటినా బిగిస్తున్నంతసేపూ నడుంపై చెయ్యి వేసి రోడ్డుమీదే నిలబడి వుంది మా ఆవిడ

వచ్చేపోయే వాళ్ళందరిని మరీ పలుకరించి టి వి కొన్న విషయం నొక్కి చెబుతూనే వుంది

మా కాలనీలో చాలమంది టి వీ లు కొన్నారు కానీ మా లైనులో మాత్రం మేమే ముందు కొంది దూరంలో వున్న ఇళ్ళకు వెళ్ళి టి వి చూసే బాద తప్పిందని మా లైనులోని ఆడవాళ్ళంతా సంతోషపడ్డారు

ప్రతి గురువారం తెలుగు సినిమా పాటలు శనివారం తెలుగు సినిమా ఆదివారం హిందీ సినిమా వొస్తాయి వదినా' ఆదివారం పగలంతా ఎదొక ప్రోగ్రాం వుంటుంది. ఇంట్లో వాళ్ళందరికి మంచి కాలక్షేపం వినోదం విజ్ఞానం' మంగళవారం తెలుగులో మంచి నాటకా లొస్తాయట మా చెల్లెలు వాళ్ళు బాపట్లలో వుంటున్నారు వాళ్ళు కూడా టి వీ కొనుక్కున్నారు వాళ్ళ కసలు తెలుగు ప్రోగ్రాములే రావట శనివారం తెలుగు సనిమాలు రావట ఇక్కడ మనకు కన్పించినంత స్పష్టంగా కూడ బొమ్మలు కన్పించవట' - పక్కింటి శారదగారు మా ఆవిడ మెరుపుదాడికి తట్టుకుంటూ మొహానికి చిరునవ్వులు పులుముకుని టి వి చూడొచ్చుననే సంబరంతో వింటున్నది

ఏమిటేపిల్లా' రోడ్డుకు అడ్డంగా నిలబడి సీమటపాకాయలా పేలుతున్నావ్' అంది చనువుగా మా లైనులోని బామ్మగారు మా యింటి ముందు నుంచి వెళ్తూ

టి వీ సంగతులన్నీ బామ్మగారికి అర్థం అయ్యేలా ఓపగ్గా చెప్పింది మా ఆవిడ

ఇంట్లోనే సినిమా పెట్టి పెట్టుకోవచ్చంటే బోల్డంత ఆశ్చర్య పడింది బామ్మగారు

మీకేం తోచనప్పుడల్లా మా ఇంటికి వొచ్చారంటే మీకు కావల్సినంత కాలక్షేపం బామ్మగారూ'

తప్పకుండా వొస్తానమ్మడూ - అంటూ వెళ్ళింది బామ్మగారు

బొట్టు పెట్టకుండానే మా లైనులోని వాళ్ళందరిని పిలిచింది మా ఆవిడ

ఇట్ సీమ్స్ యు హేవ్ పర్చేజ్డ్ టి వి ఆంటీ? - మా లైనులోని కిష్టిగాడు అడిగేడు

రేపు ఇండియా వర్సస్ ఇంగ్లెండ్ క్రికెట్ మాచ్ లైవ్ టెలికాస్ట్ వుందోయ్' తప్పకుండా రా' అని పిల్చింది యూ ఆర్ గ్రేట్ ఆంటీ' యు నో ఎవ్విరిథింగ్ ఆఫ్ ది గ్లోబ్' ఇంగ్లీషు మీడియం కిష్టిగాడు వాగేశాడు

ఆనందంతో మా ఆవిడ దబ్బి తబ్బిబయ్యింది

* * * *

సోమవారం

టి వీ కొన్న మొదటి రోజు

ఇల్లంతా సందడిగా వుంది ఇంట్లో ఏవో

శుభకార్యం జరుపు కుంటున్నట్టుగా వుంది

పట్టు చీర కట్టింది మా ఆవిడ టి వీ నాలుగు మూలలా పసుపు రాసింది కొబ్బరికాయ కొట్టింది

సాయింత్రం ఆరింటికి వొచ్చిన బామ్మగారు రాత్రి పదయ్యేవరకు మా ఇంట్లోనే వుండి పోయింది మా ఆవిడ హింది మాటలు తెలుగులోకి అనువాదం చేస్తుంటే సాక్షాత్తూ పరమేశ్వరుడిని చూస్తున్నంత ఆనందంతో కూర్చుండి పోయింది బామ్మగారు

మీకు మంచి కాలక్షేపం!

చాలా బాగుందండి! క్లియర్‌గా వొస్తుంది బొమ్మ

ప్రతి ఇంట్లో టి వీ వుండాలండి! రియల్లీ ఐ టెల్ యూ ఇట్ ఈజ్ బాట్ ప్రవొకింగ్ అండ్ ఎడ్యుకేటివ్!

సినిమాల ఖర్చు తగ్గి పోతుందనుకోండి!

వొచ్చిన వాళ్ళంతా తలోక కామెంట్ సలహాలు యిచ్చి వెళ్ళారు

రాత్రి పన్నెండయ్యే వరకూ నన్ను పడుకోనివ్వ లేదు మా ఆవిడ

కబుర్లు చెబుతూనే వుంది

వనజమ్మ మనింటికి రాలేదండీ! దానికి వొకటే కుళ్ళు మనం టి వీ కొనుక్కున్నామని

వొంట్లో బాగుండక రాలేదు లేవోయ్! - నా మాట వినిపించుకోలేదు

* * * *

మంగళవారం

ఎల్లలు పుస్తకాలు తెరవడం మానేశారు

పెద్దవాడి కళ్ళు ఎర్రబడ్డాయి వొద్దన్నా వినకుండా వాడు టి వీ దగ్గరే చతికిలపడతాడు

స్నేహితు లందరిని వెంటబెట్టు కొస్తాడు మా పెద్దవాడు

టి వీ చూడటం కంటే వీళ్ళ ఫైటింగ్ సీన్స్ ఎక్కువగా వుంటాయి వాడెవడో టి వీ చూడటానికి వొచ్చేటప్పుడు జేబునిండా వేరుశెనక్కాయలు వేసుకు వొచ్చి వెళ్ళేటప్పుడు ఖాళీ జేబుతో వెళ్ళాడు

గది నిండా వేరుశెనక్కాయల తొక్కలు

మా ఆవిడ ఖస్సు మంది

## ప్రయోజనం!

ఆపీసుల్లో
అనవసరంగా
ఉంటే చాలా
ఇబ్బంది?
పనికోసం
వచ్చేవాళ్లకు
తీరాలి గదా?
ఇబ్బంది"

—వాసాల నరసయ్య

## మా ఇంటికి రండి!

గురువారం

అందరం టి వీ చూస్తున్నాం

పక్కింటి శారదగారి చిన్నబ్బాయి టి వీ దగ్గర కెళ్ళి యాంటిగ్లేర్ గ్లాసుమీద వొక్క గుద్దు గుద్దాడు

టపీమని కిందపడింది టి వి గ్లాసు

వాడిని పట్టుకుని బాదేసింది మా ఆవిడ

దాంతో మొదలయ్యింది శారదకు మా ఆవిడకు యుద్ధం ఎన్నో సంవత్సరాల నుండి కలిసి మెలిసి వున్నారు వాళ్ళిద్దరూ

క్షణంలో శత్రువులై పోయారు

మళ్ళీ మా గడప తొక్కితే వొట్టు

శనివారం

ఏదో తలమాసిన తెలుగు సిన్మా ఏరి ఎరి తీసుకొచ్చి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తున్నారు దూరదర్శన్ వాళ్ళు

రోజూ వొచ్చేవన్నీ హింది ప్రోగ్రాములే ఎక్కువగా

వారానికి వోసారి వచ్చే తెలుగు సిన్మా చూడకుండా ఏ టి వీ ప్రేక్షకుడు వూరుకుంటాడు

మా ముందు గదంతా కిట కిటలాడి పోయింది వొకళ్ళ మీద వొకళ్ళు కూర్చున్నారు

ఆ తోపుడులో నెట్టుడులో టీపాయ్ కిందపడటం దాని మీదున్న ఫ్లవర్‌వేజ్ పగిలిపోవడం క్షణాల్లో జరిగిపోయింది

ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తుంది మా ఆవిడ?

నోరు మూసుకుని కూర్చుంది

జానకమ్మ గారబ్బాయి గదిలోనే పాస్ పోసేశాడు మా చిన్నాది లాగు తడిసి పోయింది ఆ ప్రవాహానికి

సినిమా అయిపోయింది

పిల్లల కేకలు వొకటే గోల

సినిమా అయిపోయినా కొందరు ఇంట్లోనుంచి కదల్లేదు

మేం బోజనం చెయ్యాలండి! అంటూ టి వి కట్టేసింది

కూర్చున్నవాళ్ళకు కోపం వొచ్చింది

మనస్సులోనే తిట్టుకుంటూ వెళ్ళారు

మా వాళ్ళు ఆ రోజు తొందరగానే నిద్రపోయారు

నేను మా ఆవిడ మేనువాల్చాం

అంతలో –

తలుపులు దఢ దడ చప్పుడు

వెళ్ళి తలుపు తీసింది

ఆస్ట్రేలియా వర్సెస్ పాకిస్థాన్ క్రికెట్ మాచ్ లైవ్ టెలికాస్ట్ వొస్తున్నది అంటీ! ఇఫ్ యూ డోంట్ మైండ్ ప్లీజ్ పుట్ ఆన్ యువర్ టి వి

మా ఆవిడ మైండ్ కూడ చెడిపోయింది

ఇడియట్ బాక్స్! బుద్ధిలేక కొన్నాం! – అని నాదగ్గర కొచ్చి గొణుక్కుంది

ఆదివారం

అదివరకు ఆదివారాలు ప్రశాంతంగా ఇంట్లో గడిపేవాడిని

టి వీ కొన్నాక ఏ పార్కుకో టి వీ కొనని ఫ్రెండ్ దగ్గరకో వెళ్ళడం మొదలెట్టాను

ఇప్పుడు మాత్రం గేటు దగ్గర ఎవరన్నా వొస్తున్నట్టు అలికిడయ్యిందా చూస్తున్నదల్లా టి వీ ఆఫ్ చేసి కూర్చుంటున్నది మా ఆవిడ వొచ్చిన వాళ్ళకు టి వీ సరిగ్గా రావడం లేదు స్టేషన్‌లో కరెంటు పోయింది గీత లొస్తున్నాయి అని ఏవేవో వొంకలు చెప్పడం మొదలు పెట్టింది □

